ప్రతిఒక్కరూ ఓటు వేసి మోదీకి అండగా నిలబడాలి

మాజీ ఎంపీ డాక్టర్ వినయ్

బంజారాహిల్స్: దేశం అభివృద్ధి చెందాలన్నా..జాతీయవాదం పెంపొందాలన్నా.. మరోసారి మోదీ ప్రధాని కావడానికి ప్రతిఒక్కరూ ఇంటి నుంచి పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయాలని మాజీ ఎంపీ డాక్టర్ వినయ్ సహస్రబుద్ధి అన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్ హోటల్‌లో ఫోరం ఫర్ నేషనలిస్ట్ థింకర్స్ హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడుతూ ...ప్రధాని మోదీతోనే ప్రపంచంలో భారతదేశానికి మంచి గుర్తింపు లభించిందన్నారు. సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ నెల 13న ఉదయం 6 గంటలకే పోలింగ్ స్టేషన్లకు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసివెళ్లి ఓటు వేసి మేము ఓటు వేశాం.. మీరు కూడా వేయండంటూ సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్ చేయాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటు వేసినప్పుడే మరోసారి ప్రధానిగా మోదీ విజయం సాధిస్తారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, డాక్టర్ సురేష్‌గౌడ్, ప్రకాష్‌బాబు, సునీల్‌గౌడ్, గోకుల్ రామారావు తదితరులతో పాటు నగర వ్యాప్తంగా మేధావులు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం: చింతల



గాయత్రీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి

ఫిలింనగర్: ఈ నెల 13న జరగనున్న సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించడం ద్వారా దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి పనులు ముందుకుసాగేందుకు అవకాశం ఉంటుందని ఖైరతాబాద్ బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గాయత్రీహిల్స్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మరోసారి ప్రధానిగా మోదీ ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, రాబోయే రోజుల్లోనూ ఆయన నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు.

అవినీతి మచ్చలేని కిషన్‌రెడ్డిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న బీజేపీ నేత నూనె బాలరాజ్

శ్రీనగర్‌కాలనీ: భారత్‌ను ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని నమ్మి, అవినీతి మచ్చలేని సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ బీజేపీ ఢిల్లీ సెంట్రల్ కోఆర్డినేటర్ నూనె బాలరాజ్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. అవినీతి, ఆరోపణలు, మోసకారి హామీలతో మభ్యపెట్టే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను నమ్మవద్దని దేశ, రాష్ట్ర ప్రగతిని కోరే బీజేపీకి ఓటువేయాలని కోరారు. నేతలు సూర్య, వినాయక్, గోపీ, విజయ్ పాల్గొన్నారు.

ప్రియాంకాగాంధీకి ఘన స్వాగతం



బంజారాహిల్స్: ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంకా గాంధీకి శనివారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు, అంబర్‌పేట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలుచుకుంటుందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు.

బీజేపీని ఓడించండి

పంజగుట్ట: తాము జై రాజ్యాంగం అని నినాదాలు చేసుకుంటూ యాత్ర చేస్తే కొంతమంది ఫాసిస్టు శక్తులు జై శ్రీరామ్ అంటూ తమను అడ్డుకునేందుకు ప్రయత్నించాయని 11 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా యాత్ర పూర్తి చేసుకున్న జాగో తెలంగాణ, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక ప్రతినిధులు పేర్కొన్నారు. విద్వేష విభజన, నియంతృత్వం, బడా సంపన్న అనుకూల, ప్రజా వ్యతిరేక, అప్రజాస్వామిక రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఆయా నినాదాలతో 11 రోజులు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర శనివారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్ పద్మజాషా, నైనాల గోవర్ధన్‌లు మాట్లాడుతూ... యాత్రలో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశామన్నారు. ఎన్ఆర్ఐ రాయదాసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జె.వి.చలపతి రావు, ఎం.హన్మేష్, కృష్ణ ప్రసాద్, అల్తాఫ్ జానయ్య, షైక్ బాబా, కలిదా, అరుణ్ కుమార్, బిందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బూటకపు మాటలు నమ్మొద్దు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ మాదిగలు, బీసీలకు దూరమయ్యిందని వారికి తిరిగి దగ్గరయ్యేందుకే రిజర్వేషన్లు తొలగిస్తారు, రాజ్యాంగం మారుస్తారు అని గ్లోబల్ ప్రచారం చేస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. దేశం సురక్షగా ఉండాలన్నా, అభివృద్ధి చెందాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా మూడవ సారి మోదీనే ప్రధాని కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్వయంగా మోదీ రాజ్యాంగం తనకు భగవద్గీతతో సమానం, రాజ్యాంగం వల్లే తాను ప్రధానమంత్రి అయ్యాను, నేను బతికి ఉన్నంతవరకు రాజ్యాంగం మార్చను, రిజర్వేషన్లు రద్దు చెయ్యను అని చెప్పారని గుర్తుచేశారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతగాని, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్, చిప్పలపల్లి సోమశేఖర్, తిప్పరపు లక్ష్మణ్, కొమ్ము శేఖర్, సతీష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఓటేయండి.. అయిదేళ్లు తోడుంటా!

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీలు
- కేంద్రంలో ఇండియా కూటమికి అధికారం తథ్యం
- సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్



వెంకటరమణ కాలనీలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న దానం నాగేందర్

బంజారాహిల్స్: తనను ఎమ్మెల్యే ఎన్నికల్లో ఆదరించినట్లుగానే, ఈ సారి ఎంపీ ఎన్నికల్లో కూడా ఆదరించాలని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఒక్కసారి ఓటేస్తే అయిదేళ్లు తోడుంటానని ఈ సందర్భంగా దానం స్పష్టం చేశారు. శనివారం ఎన్నికల ప్రచారం ముగింపులో భాగంగా ఆయన ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఖైరతాబాద్, ఆనంద్‌నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ, బంజారాహిల్స్‌లలో ఆయన బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ సారి కేంద్రంలో సైతం ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఫిలింనగర్‌లో బైక్ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత మామిడి నర్సింగ్‌రావు

కాంగ్రెస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ

ఫిలింనగర్: సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో శనివారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. విగ్రహాల చౌరస్తాలో ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ గురుబ్రహ్మనగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరానగర్, జవహర్ కాలనీ, ఫిలింనగర్ 18 బస్తీల్లో కొనసాగింది.



ప్రచారంలో మాజీ కార్పొరేటర్ భారతీనాయక్...

బస్తీల్లో ఇంటింటి ప్రచారం

వెంకటేశ్వరకాలనీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా బంజారాహిల్స్ మాజీ కార్పొరేటర్ బి.భారతీనాయక్ శనివారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టో, సిద్ధాంతాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటు వేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

బైక్ ర్యాలీతో బలం చాటిన దానం



బైక్ ర్యాలీలో పాల్గొన్న దానం నాగేందర్

బంజారాహిల్స్: ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలు ప్రాంతాల్లో భారీ బైక్ ర్యాలీలను నిర్వహించారు. ఉదయం జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయంలో శ్రీవెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన బంజారాహిల్స్‌లోని తన ఇంటి నుంచి ఖైరతాబాద్ నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది కార్యకర్తలతో కలిసి బైక్‌పై సికింద్రాబాద్ వెళ్లారు. ఖైరతాబాద్ ఆరు డివిజన్ల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో రహదారులన్నీ కిటకిటలాడాయి. వేలాది మంది జనంతో నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా ఆయన ప్రతిపక్షాలకు తన బలమేంటో చాటుకున్నట్లయ్యింది. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, సంక్షేమ పథకాలు అమలవుతాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సికింద్రాబాద్‌లో గెలిచి సీఎం రేవంత్‌కు బహుమతిగా ఇస్తామన్నారు. సర్వేలన్నీ కాంగ్రెస్ గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నాయని, ఈ రెండు రోజులు కార్యకర్తలు కష్టపడాలన్నారు. నాలుగు వారాలుగా తాను చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. తాజాగా బైక్ ర్యాలీతో కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో ఓటేయండి

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్



ఫిలింనగర్‌లో వడ్డెర కులస్తులు ఇచ్చిన భారీ సుత్తితో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమ కాలంలో ఏ విధంగా అయితే పార్టీకి ప్రతీ ఒక్కరు తోడుగా నిలిచారో అదే ఉద్యమ స్ఫూర్తితో ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాల్సిన అవసరం ఉందని సికింద్రాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచార ముగింపు ర్యాలీలో భాగంగా ఆయన జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో శనివారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న ఓటర్లను కలుస్తూ ఆయనను తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పటేల్‌నగర్ చౌరస్తా నుంచి గౌతంనగర్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్బీటీ నగర్‌లో ప్రచారం చేస్తున్న విప్లవ్‌కుమార్

మంచి స్పందన: విప్లవ్‌కుమార్

బంజారాహిల్స్: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె. విప్లవ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నెల రోజులుగా తాము చేస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని అన్నారు. ప్రజాగళాన్ని వినిపించేందుకు, ప్రశ్నించేందుకు పద్మారావు గౌడ్‌కు అండగా నిలబడతామని ఓటర్లు చెబుతున్నారని అన్నారు.

తెలంగాణ ప్రజా వేదిక మద్దతు కాంగ్రెస్‌కే...



బండి సదానంద్‌గౌడ్

బంజారాహిల్స్: గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందని తెలంగాణ ప్రజావేదిక అధ్యక్షుడు బండి సదానంద్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో వేదిక సభ్యులంతా తెలంగాణ మొత్తం ప్రయాణించి కాంగ్రెస్‌కు ప్రచారం చేయడం జరిగిందని, ఆ ఎన్నికల్లో విజయం సాధించడం జరిగిందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా తెలంగాణవాదులంతా, ఉద్యమకారులంతా కాంగ్రెస్‌కు ఓటు వేసి 14 సీట్లు గెలిపించాలని పేర్కొన్నారు. వేదిక ఆధ్వర్యంలో గత మూడు నెలల నుంచి తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ సిద్ధాంతాలు, సంక్షేమ పథకాలు దేశానికి ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో రాహుల్‌గాంధీ ఎంత అవసరమో చెప్పడం జరిగిందని, ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో కూడా తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ గెలుచుకుంటుందన్నారు.

లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీని బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి. చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు.



దానంకు సంపూర్ణ మద్దతు

పంజగుట్ట: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ సంఘాల సమాఖ్య ప్రకటించింది. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు కె.మహేశ్వరరాజ్ మాట్లాడుతూ... సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నామన్నారు. నాగేందర్ ఎమ్మెల్యేగా అనేక ప్రజాస్వామ్య కార్యక్రమాలు చేశారని గుర్తుచేశారు. అన్ని కులాలు, మతాలు, గంగ జమునా తైజీబ్‌లా చూసేవారన్నారు. పి.వి.రమణ, సనాఉల్లాఖాన్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు టీమ్‌ల కేటాయింపు
- జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్



మాట్లాడుతున్న రొనాల్డ్ రాస్

హిమాయత్‌నగర్: ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. శనివారం జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ నేతృత్వంలో ఆయన చాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ సాధారణ పరిశీలకులు శ్రీవిద్య, డాక్టర్ సరోజ్ కుమార్‌ల సమక్షంలో ర్యాండమైజేషన్‌ను నిర్వహించారు. జిల్లాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. జిల్లాలోని 15 అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో మొత్తం 3986 పోలింగ్ కేంద్రాలకు టీములను కేటాయించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, సీఈవో మధుకర్ నాయక్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన



విద్యార్థులకు టెక్నాలజీ గురించి వివరిస్తున్న రఘునందన్

శ్రీనగర్‌కాలనీ: దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పురోగతి... దేశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దిన సైంటిస్టుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం ఎర్రగడ్డ మోతీనగర్‌లోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా-సంస్కార్ స్కూల్స్ ఆధ్వర్యంలో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మే11న దేశపు టెక్నాలజీ డే ఎలా ఏర్పడిందన్న విషయాలను, సైన్స్ అండ్ టెక్నాలజీలో విజయాలను విద్యార్థులకు క్షుణ్ణంగా ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ వివరించారు. భారతరత్న, సైంటిస్ట్ అబ్దుల్ కలాం సేవలను స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి తెలిపారు. స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ అరవింద పాల్గొన్నారు.

మరోసారి బీజేపీని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్ అన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లో శనివారం ఈవీఎం నమూనాతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ... సికింద్రాబాద్‌లో బీజేపీని మరొకసారి గెలిపించి, దేశాభివృద్ధిలో భాగం కావాలన్నారు. పార్టీ డివిజన్ నాయకులు అనీల్ జైన్, పందిర్ల ప్రసాద్, నరహరి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమితోనే రాజ్యాంగానికి రక్ష

పంజగుట్ట: రాజ్యాంగాన్ని రక్షించడంలో ఇండియా కూటమి ఒక్కటే ప్రత్యామ్నాయంగా కనపడుతున్నదని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఓట్ నీడ్ గ్యారంటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఓటు విలువ-ప్రజాస్వామ్యం అనే అంశంపై శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ... ఎన్నికల్లో పోటీ చేసే వివిధ పార్టీల అభ్యర్థులు తాను గెలిచిన తరువాత పార్టీ మారను, మంచి విద్య, వైద్యం ఇస్తాను, నా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాను అని బాండ్ రాసి గ్యారంటీ ఇచ్చేలా ప్రజల్లో చైతన్యం రావాలన్నారు. అలాంటప్పుడే వారు బాధ్యతాయుతంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. మతతత్వ బీజేపీని అధికారం నుంచి దింపాల్సిన అవసరం ఉందన్నారు. ఓట్ నీడ్ గ్యారంటీ అధ్యక్షురాలు సోగరాబేగం, సినీ డైరెక్టర్ సయ్యద్‌రఫీ, దేవరకొండ నాగరాజు, స్నేహా రెడ్డి, మన్నారం నాగరాజు, శ్రీనివాస్ యాదవ్, ఇంద్రవల్లి రమేష్, భద్ర పాల్గొన్నారు.

వ్యభిచార గృహం నుంచి బాలికకు విముక్తి

పెంపుడు తల్లిని అరెస్టు చేసిన వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: వ్యభిచారం గృహం నుంచి మైనర్ బాలికకు విముక్తి కలిగింది. వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్‌కు చెందిన పి.లక్ష్మి అనే మహిళ జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తుంది. సినిమా పాత్రల ద్వారా వచ్చే ఆదాయం సరిపోవకపోవడంతో ఇతర మహిళలతో కలిసి వ్యభిచారం గృహాన్ని నిర్వహించడం మొదలుపెట్టింది. తన వద్ద పెరుగుతున్న ఓ మైనర్ బాలికను బలవంతంగా వ్యభిచారం రొంపిలోకి దింపేందుకు ప్రయత్నించారు. రెండేళ్లుగా బాధితురాలిని మానసికంగా వేధిస్తూ చిత్రహింసలకు గురి చేయసాగారు. ఆమె నిరాకరించడంతో కర్రలతో కొట్టడం, ఇనుప చువ్వలతో శరీరంపై కాలుస్తూ శారీరకంగా హింసించారు. ఆమెను బలవంతంగా పాఠశాల నుంచి చదువు మాన్పించారు. బాధితురాలు ఎంతకీ వినకపోవడంతో ఆమె జుట్టును కత్తిరించేశారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వ్యభిచార గృహంపై దాడి చేసి మైనర్ బాలికను రక్షించారు. నిందితురాలు లక్ష్మిని అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్‌కు భారత్ క్రిస్టియన్ కౌన్సిల్ మద్దతు



మాట్లాడుతున్న బిషప్ డాక్టర్ భాస్కర్

హిమాయత్‌నగర్: తెలంగాణలోని 33 జిల్లాల క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, ఫెలోషిప్స్, అసోసియేషన్స్, బిషప్ కౌన్సిల్స్, తెలంగాణ క్రైస్తవులందరూ ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చేయాలని భారత్ క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ ముల్కలా భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి భారత్ క్రిస్టియన్ కౌన్సిల్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ బహిరంగంగా ప్రకటిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్రంగా అన్యాయం చేస్తున్న మతతత్వ పార్టీలను ఈ ఎన్నికల్లో ఓడించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 17 ఎంపీ స్థానాలను గెలిపించి, రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలన్నారు. సమావేశంలో క్రైస్తవ కాంగ్రెస్ నాయకులు ఎస్.కెన్నెడీ, రాధా మాథ్యూస్, డాక్టర్ జి.భరత్, వెంకట్, సుధీర్ పాల్గొన్నారు.

బిల్డింగ్ పైనుంచి పడి సెక్యూరిటీ గార్డు మృతి

వెంగళరావునగర్: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి కిందపడి సెక్యూరిటీగార్డు మృతిచెందిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం బీహార్‌కు చెందిన సుమీత్‌కుమార్ మధురానగర్ ఎఫ్-35లో నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. బిల్డింగ్ క్యూరింగ్ కూడా చేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీ క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు 3వ ఫ్లోర్ నుంచి కింద పడ్డాడు. అతనిని ఆసుపత్రికి తరలించగా శనివారం మృతి చెందాడు. దాంతో అతని మామ మనీష్‌కుమార్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్‌పై కేసు నమోదు

వెంగళరావునగర్: అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్‌పై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... ఈ నెల 10వ తేదీ సాయంత్రం జవహర్‌నగర్‌లో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యతో బీఆర్ఎస్ పార్టీ నేతలు విజయ్‌కుమార్, బాలు, రషీద్, సల్మాన్ తదితరులు తమ పార్టీ కండువాలు కప్పుకుని పోలీసుల అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నారు. దాంతో మధురానగర్ పోలీసులు ఆమెతోపాటు నాయకులపై కూడా కేసు నమోదు చేశారు. మరోవైపు కాంగ్రెస్ నేతలు కూడా తమ పార్టీ కండువా కప్పుకుని పోలీసుల అనుమతి లేకుండా ప్రచారం చేస్తున్నారు. దాంతో ఆ పార్టీకి చెందిన అజ్జు, ఖలీద్, మనోజ్, ఆదిల్, నజీరుద్దీన్‌లపై కూడా మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు చెల్లించమన్నందుకే హత్య

వెంగళరావునగర్: సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీ రవికుమార్ హత్యను మధురానగర్ పోలీసులు ఛేదించారు. ఈ నెల 8న ఇంజినీర్స్ కాలనీలో రవికుమార్‌ను గుర్తుతెలియని వ్యక్తి హత్య చేసిన విషయం తెలిసిందే. నిందితుడు చింతగుంట చంద్రమౌళి అలియాజ్ చంద్రారెడ్డిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. చంద్రారెడ్డి సినిమాలకు ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తూ యూసుఫ్‌గూడ (వెంకటగిరి)లో ఉంటున్నాడు. చంద్రారెడ్డి, రవికుమార్ పక్కపక్కనే ఉండేవారు. చంద్రారెడ్డికి డబ్బులు అవసరమై రవికుమార్ వద్ద రూ. 5 లక్షలు అప్పు తీసుకున్నాడు. రవికుమార్ అధిక వడ్డీ వేసినప్పటికీ నగదు మొత్తాన్ని చంద్రారెడ్డి చెల్లించాడు. అయినా ఇంకా రూ. 3 లక్షలు కావాలని వేధిస్తున్నాడు. దీంతో విసుగుచెందిన చంద్రారెడ్డి పథకం ప్రకారం రవికుమార్‌ను హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల బైక్ ర్యాలీ

రహమత్‌నగర్: ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం కాంగ్రెస్ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి ఆధ్వర్యంలో ఎంఐఎం, కాంగ్రెస్ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ఎంఐఎం పార్టీ మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అత్యధిక మెజారిటీ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు మన్సూర్, ఎక్బాల్, లింగమూర్తి, భాస్కర్, షరీఫ్, పల్లె సాయిలు, ఎత్తరి అంతయ్య, ఎంఐఎం నేత సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.